# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా అర్హులైన వారందరూ రేపు స్వచ్ఛంద రక్తదానం చేయాలని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ విజ్ఞప్తి చేశారు.
- రాష్ట్రాన్ని వచ్చే సంవత్సరం నాటికి మోడల్ ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చదిద్దుతామని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.
- చేనేత కార్మికుల వేతనాలు, ప్రాసెసింగ్ చార్జీలను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
- బెలూం గుహలకు భౌగోళిక గుర్తింపు లభించడం పట్ల పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు.

======================

రాష్ట్రాన్ని వచ్చే సంవత్సరం నాటికి మోడల్ ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈరోజు అమరావతిలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని 80 శాతం మంది విద్యార్థులకు పాఠశాల కిట్‌లు అందించామని తెలిపారు. మిగిలిన 20 శాతం మందికి ఈనెల 20వ తేదీ లోగా అందిస్తామన్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం వర్తింప చేస్తామన్నరు. రాష్ట్ర వ్యాప్తంగా 9 వేల 600 పాఠశాలల్లో "ఒక తరగతి - ఒక ఉపాధ్యాయుడు" విధానాన్ని అమలు చేశామని మంత్రి తెలుపుతూ...

(వాయిస్ 35 సెకన్లు)

======================

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా అర్హులైన వారందరూ స్వచ్ఛంద రక్తదానం చేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ విజ్ఞప్తి చేశారు. రేపు ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని ఈరోజు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు రక్తదానం ప్రాముఖ్యతను గుర్తు చేసుకునేందుకు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని గవర్నర్ తెలిపారు. "రక్తాన్ని ఇవ్వండి.. ఆశను ఇవ్వండి.. కలిసి ప్రాణాలను కాపాడుకుందాం" అనే

ఇతివృత్తంతో ఈ సంవత్సరం ప్రపంచ రక్తదాతల దినోత్సవం జరుపుకుంటున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థులు, యువత ఎపి రెడ్ క్రాస్ మొబైల్ యాప్ ద్వారా రక్తదాతలుగా నమోదు చేసుకోని, స్వచ్ఛంద రక్తదానం చేయాలని కోరారు.

======================

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నంద్యాల జిల్లా కొలిమిగుండ్లలోని బెలూం గుహలకు భౌగోళిక గుర్తింపు దక్కడం ఎంతో సంతోషకరమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈరోజు అమరావతిలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... దేశంలోనే పొడవైన అంతర్భాగ గుహలుగా ప్రసిద్ధి చెందిన బెలూం గుహలకు ఈ గుర్తింపుతో పర్యాటకంగా మరింత ప్రాచుర్యం లభిస్తుందన్నారు. పురాతన సంస్కృతీ నిలయాలైన ఈ గుహలు మరింత అభివృద్ధికి నోచుకోనున్నాయని అన్నారు. విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా వీటికి మరింత ప్రచారం కల్పిస్తామని మంత్రి దుర్గేష్ తెలియజేశారు.

======================

రాష్ట్రంలో చేనేత రంగాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని జౌళి, వస్త్ర పరిశ్రమ శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. ఈరోజు అమరావతిలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... నేతన్నలకు లబ్ధిచేకూర్చే విధంగా వేతనాలు, ప్రాసెసింగ్ చార్జీలను పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దీనితో నేత కార్మికులకు ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. నేత కార్మికులతో పాటు హస్తకళాకారుల ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో నూతన డిజైన్ల కోసం పోటీలు నిర్వహించబోతున్నామని మంత్రి తెలిపారు. ఆప్కో, లేపాక్షి పనితీరు మరింత మెరుగుపరచడానికి విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (IIM)తో ఒప్పందం చేసుకుంటున్నామని మంత్రి వివరిస్తూ..

(వాయిస్ 30 సెకన్లు)

======================

బాపట్ల జిల్లా చీరాల కుప్పడం చీరలకు ఒకే జిల్లా- ఒక ఉత్పత్తి కింద జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. ఇందుకు గాను ఢిల్లీలో ఈనెల 18వ తేదీన జరిగే "ODOP" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకట మురళి అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... చీరాల "సిల్క్ చీర"కు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం అంటే జిల్లాలోని చేనేతలకు మంచి గుర్తింపు లభించినట్లేనన్నారు. తద్వారా చీరాల "సిల్క్ చీరల"కు ఇకపై జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు.

విరామం

======================

విమాన ప్రమాదానంతర చర్యల విషయంలో కేంద్రప్రభుత్వానికి అండగా ఉంటామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో నగరాభివృద్ధి, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అమృత్ పథకం, పలు రైల్వే ప్రాజెక్టులు వంటి విషయాలపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.... అహమ్మదాబాద్ విమాన ప్రమాదం దురదృష్టకరమని అన్నారు. జిల్లాలో పలు రైల్వే ప్రాజెక్టుల పనులు వేగవంతమవుతున్నాయని వివరిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

======================

గుంటూరు జిల్లా మంగళ గిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో రోగులకు మరిన్ని వైద్య సేవలు అందించేలా కృషి చేయాలని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభ నేని బాలశౌరి కేంద్రాన్ని కోరారు. ఈరోజు ఢిల్లీలో కుటుంబ సంక్షేమ శాఖ సెక్రటరీ పుణ్య శ్రీవాత్సవ, జాయింట్ సెక్రటరీ అంకితా మిశ్రా బుందేలాతో ఆయన సమావేశమయ్యి ఆసుపత్రి అభివృద్ధిపై చర్చించారు. మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో 25 లక్షల మంది రోగులకు వైద్య సేవలు అందించడం గర్వకారణమని, భవిష్యత్‌లో మరింత మంది రోగులకు అవసరమైన వైద్య సేవలు అందించడం ద్వారా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎయిమ్స్ ఆసుపత్రికి ప్రతి రోజు తరలివచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో అదే స్థాయిలో వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

=======================

గ్రామ విత్తన ఉత్పత్తి ద్వారా రైతులు సాగు చేసుకునే విత్తనాలను సొంతంగా ఉత్పత్తి చేసుకోవచ్చని పశ్చిమ గోదావరి జిల్లా మారుటేరు వరి పరిశోధనా సంస్థ సహ సంచాలకులు డాక్టర్ తాటి శ్రీనివాస్ చెప్పారు. మారుటేరులో వరి పరిశోధన సంస్థ రూపొందించిన ఉత్తమ వరి వంగడాల విత్తనాలను ఈరోజు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ... 73 రకాల వరి వంగడాలను తమ సంస్థ రూపొందించిందన్నారు. ఇందులో దోమను తట్టుకునే వజ్ర, ముంపును తట్టుకునే స్వర్ణ రకం ప్రధానమైనవి శ్రీనివాస్ వివరిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

=======================

'ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం" నిర్దేశిత లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈరోజు పిఎం సూర్య ఘర్ పథకం కార్యక్రమాలపై కలెక్టర్ దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ పథకంపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. లబ్ధిదారులకు అవసరమైతే బ్యాంకులు రుణాలను మంజూరు చేయాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు 162 మంది లబ్ధిదారుల ఇళ్లల్లో ఈ పథకం కింద సౌర ఫలకలను ఏర్పాటు చేశామని, మరిన్ని సౌర విద్యుత్ ప్యానెళ్లను అమర్చి విద్యుత్ ఉత్పాదకతలో జిల్లా ఆదర్శంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

=======================

కర్ణాటకలోని హోస్కోటే వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. చిత్తూరు నుంచి బెంగళూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతులను చిత్తూరు జిల్లా వాసులుగా గుర్తించారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

=======================
=======================